# 26 నుంచి తెదేపా-లెఫ్ట్ సమ్మేళనాలు

- తొలిరోజు నల్గొండలో ప్రారంభం
- చంద్రబాబు, రాఘవులు, నారాయణ హాజరు
- జనచైతన్య యాత్రలూ అప్పటినుంచే
- 59 తెదేపా బృందాలు సిద్ధం

హైదరాబాద్ - న్యూస్‌టుడే

తెలుగుదేశం, సీపీఎం, సీపీఐ కార్యకర్తలను ఏకతాటిపైకి తెచ్చి ఎన్నికలపోరుకు సిద్ధం చేసేందుకు నిర్వహించ తల పెట్టిన రాజకీయ సమ్మేళనాలు ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆ పార్టీలు తుది నిర్ణయం తీసుకున్నాయి. తొలుత 25 నుంచి అను కున్నా.. ఆ రోజు క్రిస్మస్ పండగ ఉన్నందున తర్వాతి రోజు నుంచి మొదలుపెట్టి జనవరి 5 వరకు అన్ని జిల్లా కేంద్రాల్లోనూ సమ్మేళనాలు నిర్వహించనున్నారు. తొలి సమ్మేళనం నల్గొండజిల్లాలో ప్రారంభం కానుంది. దీనికి తెదేపా అధినేత చంద్రబాబు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బి.వి.రాఘవులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.నారాయణ హాజరవుతారు. శుక్రవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో తెదేపా నేత కంభంపాటి రామ్మోహన్‌రావు, సీపీఎం నేత వై.వెంకటేశ్వరరావు, సీపీఐ నేత కె.రామకృష్ణ సమావే శమై సమ్మేళనాల ప్రణాళిక రూపొందించారు. 26న జరిగే తొలి సమ్మేళనానికి మూడు పార్టీల అగ్రనేతలు వస్తున్నందున నల్గొండలో బహిరంగసభ ఏర్పాటు చేయా లనే ఆలోచన కూడా నేతల్లో ఉంది. 27న శ్రీకాకుళం, కృష్ణా, మెదక్ జిల్లాల్లో.. 28న ఆదిలాబాద్, విజయన గరం.. 29న కడప, ఖమ్మం, తూర్పుగోదావరి.. 30న వరంగల్, ప్రకాశం, రంగారెడ్డి, విశాఖపట్నం. 31న అనం తపురం, గుంటూరు, మహబూబ్‌నగర్ జిల్లాల్లో సమ్మేళ నాలు నిర్వహిస్తారు. జనవరి 1న విరామం. 2న హైద రాబాద్, కరీంనగర్, నెల్లూరు.. 3న పశ్చిమగోదావరి, కర్నూలు.. 5న చిత్తూరు, నిజామాబాద్ జిల్లాల్లో సమ్మేళ నాలు జరుగుతాయి. ప్రతి జిల్లా సమావేశానికి మూడు పార్టీలకు చెందిన రాష్ట్రస్థాయి నేతలు హాజరవుతారు.

## అవాకులు చెవాకులు పేలుతున్న వైఎస్

తెదేపా, సీపీఎం, సీపీఐల కూటమిని ఉద్దేశించి ముఖ్య మంత్రి వైఎస్ రెచ్చగొట్టేరీతిలో అవాకులు చెవాకులు పేలుతున్నారని సీపీఐ నేత కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లా డారు. ఈసారి ఎన్నికల్లో కడప నుంచి వైఎస్ జగన్ నిల బడితే కాంగ్రెస్‌పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేలే ఓడిస్తారని చెప్పారు. సీపీఎం నేత వై.వెంకటేశ్వరరావు మాట్లా డుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించడమే ప్రధానమైన అంశంగా తాము భావిస్తున్నామని చెప్పారు. తమ కూటమి చేతిలో కాంగ్రెస్ చిత్తుగా ఓడి పోవడం ఖాయమని తెదేపా నేత కంభంపాటి రామ్మో హన్‌రావు అన్నారు.

## నల్గొండలో బాబు జనచైతన్య యాత్ర

నల్గొండ జిల్లానుంచి చంద్రబాబు పర్యటన ప్రారంభం కానుంది. 26న జిల్లాలో జరిగే రాజకీయ సమ్మేళనంలో పాల్గొంటారు. అదేరోజు తెదేపా సొంతంగా నిర్వహిస్తున్న జనచైతన్య యాత్రలు కూడా ప్రారంభమవుతాయి. ఇందులో భాగంగా చంద్రబాబు 27న వరంగల్‌లో.. 28, 29లలో కరీంనగర్, 30, 31లలో మెదక్ జిల్లాలో పర్యటిస్తారు. ఈ యాత్రల కోసం తెదేపా 59 బృందాలను సిద్ధం చేసింది. పార్టీ సీనియర్ నేతలతో కూడిన ఒక్కో బృందం 5 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగే యాత్రల్లో పాల్గొంటుంది. ప్రతి నియోజకవర్గంలోనూ 3 రోజులపాటు పర్యటిస్తుంది.